రాణా ప్రారంభమెప్పుడో..?

- పనులు పూర్తయి రెండేళ్లు..
- కొమురవెల్లి జాతరకు వచ్చే పోలీసులకు తప్పని తిప్పలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొమురవెల్లి పోలీస్‌స్టేషన్

కొమురవెల్లి(సిద్దిపేట): పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం నూతన మండలాలు ఏర్పాటు చేసింది. మండలాల ఏర్పాటులో భాగంగా కొమురవెల్లిలో నూతన పోలీస్‌స్టేషన్‌ను తాత్కాలికంగా ఆలయ వసతి గదిలో ఏర్పాటు చేశారు. నూతన పోలీస్ స్టేషన్ మంజూరు కోసం ప్రభుత్వం 2018లో రూ. 1 కోటి మంజూరు చేయడంతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి పూర్తి చేశారు. అయితే పనులు పూర్తయి సుమారు రెండేళ్లు గడుస్తున్నా భవనాన్ని ప్రారంభించడంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర జనవరి నుంచి మూడు నెలల పాటు కొనసాగుతుంది. జాతర బ్రహ్మోత్సవాల్లో పోలీసుల పాత్ర కీలకంగా ఉంటుంది. జాతరకు సిద్దిపేట జిల్లాతో పాటు వరంగల్, జనగామ జిల్లా పోలీసులు స్వామి వారి కల్యాణం, అగ్నిగుండాలు, పెద్దపట్నం తదితర పూజల సమయంలో వచ్చి విధులు నిర్వర్తిస్తారు. ప్రస్తుతం తాత్కాలికంగా కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్ చిన్నదిగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎస్‌ఐ చంద్రమోహన్ యాదవ్ ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేశారు. స్టేషన్‌లో కావాల్సిన ఫర్నిచర్‌ను సమకూర్చారు. ఆయన బదిలీ కాగానే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై ప్రస్తుత ఎస్‌ఐ నాగరాజును వివరణ కోరగా చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని పూర్తి చేసి ఉన్నతాధికారులతో సంప్రదించి జాతర బ్రహ్మోత్సవాలకు ముందే ప్రారంభిస్తామని తెలిపారు.

సమన్వయంతో పనిచేయండి

- జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

ములుగు(గజ్వేల్): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. ములుగు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశంలో సభ్యులు లేవనెత్తే సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈక్రమంలో జప్తిసింగాయిపల్లి, కొట్యాల గ్రామాల సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, గణేష్‌గుప్త మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పైపులు పగిలి పోతుండటంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. గ్రామాల్లో నీటిని నిల్వ ఉంచేందుకు గానూ సంపులు నిర్మించాలని కోరారు. నర్సాపూర్ సర్పంచ్ మల్లేష్‌యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అందజేసే గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా నేటికి గొర్రెల పంపిణీ జరగలేదని వాపోయారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ సలీం, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌ను మండల ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారంలో భాగంగా నిర్వహించే 'విక్‌సిత్ భారత్ సంకల్ప్ యాత్ర' మండల కేంద్రంలో శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో డాక్టర్ రమ్య అధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అదేవిధంగా బ్యాంక్ అధికారులు ముద్ర లోన్‌లతో పాటు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో శనివారం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధిని వివరించేందుకు భారత్ సంకల్ప యాత్ర చేపట్టింది. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేంద్ర రెడ్డి, సర్పంచ్ సాయిలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి


అక్షయను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, తదితరులు

దుబ్బాక: ఎస్‌జీఎఫ్ అండర్- 17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కర్నాల అక్షయ ఎంపిక కావడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థిని సత్కరించి రూ. 5 వేల నగదు బహుమతి అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్షయ జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటి దుబ్బాక పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల స్వామి, బాలకృష్ణగౌడ్, కనకయ్య, కో ఆప్షన్ సభ్యురాలు పెంటమ్మ , ఎంఈఓ ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీపీ వంగ సవిత



మాట్లాడుతున్న ఎంపీపీ సవిత

సిద్దిపేటఅర్బన్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ వంగ సవితా ప్రవీణ్‌రెడ్డి సూచించారు. సిద్దిపేట అర్బన్ మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిదులు చొరవ తీసుకోవాలని సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. పింఛన్ అందించాలని, రేషన్ కార్డులు కొత్తవి మంజూరు చేయడంతో పాటు నూతన పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. బక్రిచెప్యాల, నాంచారుపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులు కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మెతుకు ఫౌండేషన్ చైర్మన్ మృతి


రవీందర్ (ఫైల్)

గజ్వేల్‌రూరల్: గుండెపోటుతో మెతుకు ఫౌండేషన్ చైర్మన్ మృతిచెందిన సంఘటన శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కారం గ్రామానికి చెందిన మెతుకు రవీందర్ గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించేవారు. తను మెతుకు ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగానికి దీర్ఘకాలిక సెలవు పెట్టి సన్ పరివార్ సంస్థను ఏర్పాటు చేశారు. సంస్థలో డబ్బులు పెట్టుబడిగా పెడితే రెట్టింపు లాభాలతో పాటు కమీషన్ అధికంగా వస్తాయని ఆశ చూపి పెద్ద మొత్తంలో ప్రజలను నుంచి డబ్బులు వసూలు చేశారు. కొంతకాలం గడిచిన తర్వాత వారికి తిరిగి ఇవ్వకపోవడంతో సన్ పరివార్ సంస్థ మోసాలు బయట పడ్డాయి. ఈ సంస్థపై గతంలో ఈడీ అధికారులు పలు చోట్ల దాడులు చేసి కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈక్రమంలో శనివారం గుండెపోటుకు గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

దౌల్తాబాద్(దుబ్బాక): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరంపల్లికి చెందిన కుమ్మరి రమేష్ దౌల్తాబాద్‌కు వచ్చి తిరుగు వెళ్తున్నాడు. ఈక్రమంలో దొమ్మాటకు చెందిన చందు, భాను దౌల్తాబాద్‌కు వస్తున్న క్రమంలో దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు.

క్రమ శిక్షణతో కూడిన విద్య అందించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ జయంతి

కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్య అందేలా చూడాలని సర్పంచ్ పాల్కంపల్లి జయంతి ఉపాధ్యాయులను కోరారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య, పీఎస్‌ఆర్ ట్రస్టు నిర్వాహకులు నరేందర్, హెచ్ఎం సత్తయ్య, నాయకులు సంపత్, నాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

సిద్దిపేటరూరల్: దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు దేశెట్టి శాంసన్ శనివారం మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరైన సంఘం సభ్యులు నివాళులర్పించి ఆయన కుటుంబానికి సంఘం తరపున రూ.16 వేల ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. శాంసన్ సంఘానికి చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్, నాయకులు యాదగిరి, బాలమణి, భూపతిరెడ్డి, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి


ప్రొబేషనరీ ఎస్సై దామోదర్‌ను సన్మానిస్తున్న సీఐ కృష్ణ, ఎస్సై గంగరాజు

దుబ్బాక: అంకితభావంతో పనిచేసి డిపార్ట్‌మెంట్, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ, ఎస్సై గంగరాజు ప్రొబేషనరీ ఎస్సై దామోదర్‌కు సూచించారు. శిక్షణ నిమిత్తం దుబ్బాకకు వచ్చిన దామోదర్ శిక్షణ కాలం ముగియడంతో శనివారం సీఐ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శిక్షణ ఎస్సైగా దుబ్బాకకు వచ్చి చేర్యాల ఎస్సైగా నియమితులు కావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హరిసింగ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని నవ భారత్ హైస్కూల్‌లో విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా నిర్మూలన, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై శనివారం ఎస్సై మహేష్ అవగాహన కల్పించారు. ఎవరూ బాల్య వివాహాలు చేసుకొని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా గురించి సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హుస్నాబాద్ షీటీం బృందం హెడ్ కానిస్టేబుల్ సదయ్య, సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై మహేష్

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ


ప్రజాప్రతినిధులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఈజీఎస్ 13వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించగా.. సరైన సమాచారం లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సామాజిక తనిఖీ జరుగుతుందన్న విషయం ప్రజా ప్రతినిధులకు, ఉపాధి కూలీలకు ఎందుకు సమాచారం ఇవ్వలేదంటూ ఎంపీపీ గజ్జెల సాయిలు తనిఖీ సమావేశం నుంచి అసహనంగా వెళ్లిపోయారు. దీంతో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవ్ ఆర్య సామాజిక తనిఖీని యథావిధిగా నిర్వహించారు. కోట్లాది రూపాయలతో నిర్వహిస్తున్న ఈజీఎస్ పనులపై జరిగిన అవకతవకలపై తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు ప్రజా ప్రతినిధులను విస్మరించడం ఎంత వరకు సమంజసమని ఎంపీపీ సాయిలు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

వేగం కన్నా.. ప్రాణం మిన్న


విద్యార్థుల మానవహారం

హుస్నాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ తిరుమల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలను పిల్లలచే నిర్వహించి వారికి సమాజం పట్ల ఉన్న బాధ్యతను గుర్తుతెస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు త్వరగా గమ్యాన్ని చేరుకోవాలని అతి వేగంతో వాహనాలను నడుపవద్దన్నారు. ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ మల్లెపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం మధు, తదితరులు పాల్గొన్నారు.

పంతులుతండాకు బస్సు సౌకర్యం


బస్సును ప్రారంభిస్తున్న సర్పంచ్ అశ్విని

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 11వ తేదీన 'మా ఊరికి బస్సే లేదు' ఆర్టీసీ బస్సుల కోసం పల్లెల ఎదురుచూపు అంటూ 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పందించారు. మండలంలోని పంతుల్‌తండాకు శనివారం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సర్పంచ్ భూక్య అశ్వినిహేము ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు తండావాసుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రవినాయక్, నాయకులు రాజేందర్‌నాయక్, లకుపతి, పీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమించిన స్థలాలు ప్రభుత్వానికి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలు తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించకుండా పరిరక్షించాల్సిన సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరు మీద వైస్ చైర్మన్ రమణాచారితో కలిసి కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. మిట్టపల్లిలోని పలు సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉందని దాదాపు 30 ఎకరాలకు పైగా భూమిని సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఆక్రమణకు సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మజార్ మాలిక్, పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్, నజ్జు, నవాజ్, యాదగిరి, ప్రశాంత్, ఫయాజ్, నాని, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి


ఎమ్మెల్యే కవ్వంపల్లికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ శనివారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ధరణితో అక్రమంగా చేసుకున్న పట్టాలను గుర్తించి వాటిని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, చెన్నారెడ్డి, గాదం మల్లికార్జున్, పరశురాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వర్గీకరణ జరిగే వరకు పోరాటం**

నంగునూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఎంఎస్పీ జిల్లా సహాయ కార్యదర్శి కందికట్ల రాజు అన్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా కమిటీ నిర్మాణంలో భాగంగా శనివారం సిద్దన్నపేటకు చెందిన కందికట్ల రాజును సహ కార్యదర్శిగా నియమించారు.

◆ **బెజ్జంకిని కరీంనగర్ జిల్లాలో కలపాలి**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలపాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజల మనోభావాలను గుర్తించి ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు.

◆ **మానవత్వం చాటుకున్న తోటి మిత్రులు**

హుస్నాబాద్: హుస్నాబాద్‌పట్టణంలో 1983– 84లో పదో తరగతి చదివిన బడిసోపతుల గ్రూపు సభ్యులు తోటి మిత్రుడు మార్కొండ శ్రీనివాస్ కూతురు వివాహానికి రూ.1.16 లక్షల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సభ్యులు కొత్తపల్లి అశోక్, కరీంనగర్ ఎంపీడీఓ సంపత్, కొండూరు శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, కన్నోజు శ్రీనివాస్, కాయిత రాజిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష**

వర్గల్(గజ్వేల్): మద్యం సేవించి బైక్ నడిపిన వ్యక్తికి గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి ప్రియాంక శనివారం రెండు రోజుల జైలుశిక్ష విధించారని వర్గల్ మండలం గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. మైలారం గ్రామానికి చెందిన ఉప్పరి స్వామి మద్యం సేవించి బైక్ నడపగా, డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.

◆ **నూతన నియామకం**

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల కేంద్రానికి చెందిన అక్కరవేణి పోచయ్యను నియమించినట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులకు పోచయ్య కృతజ్ఞతలు తెలిపారు.

◆ **బాడీ ఫ్రీజర్ అందజేత**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన వైద్యురాలు డాక్టర్ సీహెచ్ దీపాంజలి శ్రీనివాస్ తన తండ్రి నాగనాథ్ జ్ఞాపకార్థం రూ. 60 వేల విలువైన బాడీ ఫ్రీజర్‌ను మున్సిపాలిటీకి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రమేష్, యాదిరెడ్డి, సత్యనారాయణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బస్సు సౌకర్యం కల్పించాలని వినతి**

వర్గల్(గజ్వేల్): మండలంలోని నెంటూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన రంగు ప్రదీప్‌గౌడ్, కిచ్చుగారి పాండు, ఎర్రవల్లి భాను, మధు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం గజ్వేల్– ప్రజ్ఞాపూర్ డిపో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల నుంచి బస్సు సౌకర్యం నిలిచిపోయిందని వాపోయారు.

◆ **దుర్గామాతను దర్శించుకున్న కొమ్మూరి**



చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పట్టణంలోని భక్తులందరూ అమ్మవారికి బోనం సమర్పించుకున్నారు.

◆ **యువతి అదృశ్యం**

దుబ్బాకరూరల్: మండలంలోని రాజక్కపేటకు చెందిన బుయ్య నర్సింలు చిన్న కూతురు మమత ఇంటి నుంచి తప్పిపోయిందని ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11వ తేదీన అదే గ్రామంలో నర్సింలు తన తమ్ముడి కూతురు వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మమత మాత్రం ఇంట్లోనే ఉంది. అదే రోజు రాత్రి ఇంటికి వచ్చే సరికి కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. 13వ తేదీన ఒక వ్యక్తిని పెళ్లి చేసుకున్న ఫొటోను తండ్రి ఫోన్‌కు వాట్సాప్ చేసింది. ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే పనిచేయలేదు. దీంతో తన కూతురు ఆచూకీ కోసం తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.